# భావాలు వేరైనా..

ఆ రోజు ఆదివారం.

పిల్లలంతా ఇంట్లో ఉంటారు. సెలవ రోజన్న మాటే కానీ పని ఎక్కువౌతుంది.

ఆదివారం పొద్దున్న ఫలహారం చెయ్యాలి. మిగతా రోజుల్లో అన్నాలు తినేసి ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోతారు.

ఉప్మా చేస్తోంది సుభద్ర.

పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడే సుఖం. పెద్దవాళ్ళయ్యాక మాట వినరు, వినిపించుకోరు. ఎవరి ధోరణి వాళ్ళదే. తలొక మాటా అంటారు. ఏమైనా చెప్పబోతే విడ్డూరంగా చూస్తారు, తనో అనాగరికురాలు అయినట్లు.

అది తనకెంత బాధ కలిగిస్తుందో వాళ్ళకి తెలీదు.

పిల్లలు, తన పిల్లలే కదా అవి అన్నీ సహించెయ్యాలి.

సుధ వచ్చి నాలుగు రోజులైంది. అసలు సంగతి నిన్న చెప్పింది. ఈ ఏడాది లోగా ఫారిన్ వెడతారుట! వంట్లో బాగుండటంలేదుట. నెల తప్పిందిట. తమ ఫారిన్ ప్రయాణానికి అడ్డు వస్తుందేమో... తను ప్రయాణం మానుకోవలసివస్తుం దేమోనని ఆలోచనగా ఉందిట. ఏ గొడవా లేకుండా ఎబార్షన్ చేయించుకుందా మనుకుంటోంది.

''ఏమంటావ్? మళ్లీ చెప్పలేదంటావ్!'' అని చెప్పటానికి వచ్చింది.

ఏమంటుంది! ఏమైనా అనటానికి వింటేనా! తనేదైనా అంటే మొహం మీదే నవ్వటానికే కదూ. ఇంకా సుధ కాస్త నయమే ఏ మూలో అమ్మ అన్న భావం ఉంచుకుంది.

''ఇంకా ఫలహారం అవలేదూ'' డ్రాయింగ్ రూమ్‌లోంచి భర్త సుబ్బారావు కేక పెట్టాడు.

సుభద్ర ఉప్మా ప్లేటు మంచినీళ్లూ తీసుకుని వెళ్ళింది.

ఆయన సోఫాలో కూచుని పేపర్ చదువుకుంటున్నాడు.

''ఈ మగవాళ్ళ బతుకెంత హాయి! చేతనైనంత సంపాదించి తెస్తారు. భార్య చేతికిచ్చి ఆ నాలుగు రాళ్ళూ, బాధ్యతలన్నీ కడిగేసుకుంటారు. బాధ్యతంతా ఇల్లాలిదే.

ఏం కావాల్సి వచ్చినా పిల్లంతా తల్లినే అడుగుతారు. ఏ సమస్య వచ్చినా తను మధన పడాల్సిందే.

''నీకు మరీ చాదస్తం'' అనేసి ఆయన ఒక్కమాటతో దులపరించేసుకుంటారు.

ఈ రోజుల్లో సమస్యల కేం కొదువ! తెల్లారి లేస్తే...

ఆలోచనల్లో కొట్టుకుపోతున్న సుభద్ర గేటు చప్పుడు విని అటు చూసింది.

ఇద్దరు అబ్బాయిలు లోపలికి వస్తున్నారు.

''ఇంకేముంది చందాకోసం అయిఉంటుంది. ఆయన దృష్టిలో పడకుండా పంపించెయ్యాలి.'' అనుకుంటూ వరండా లోకి వెళ్ళింది.

''అసలే కరువు కాలం. మీ రిట్లాగ తెల్లవారగనే చందాలంటూ వస్తే... మాకూ పనులుంటాయి'' అంది.

''మేము...'' అంటూ సందేహిస్తున్నాడు ఒక అబ్బాయి.

''నాకూ తెలుసులే. రోజూ రాము, ఏడాది కొకసారే వస్తామంటావు. అందరూ అట్లాగే అంటారు నాయనా... ఇట్లాగ మా కెంతమందో... వెళ్ళండి'' అంది.

తలంటు స్నానం పూర్తి అయి గీత అక్కడికి వచ్చింది.

తల్లి ఆ ఇద్దరినీ నిలబెట్టి వెళ్ళమంటోంది. మొదట నిర్ఘాంతపడింది. అంతలోనే తెలివితో బాటు కోపం పొంగుకు వచ్చింది.

''హాయి... శంకర్... లోపలికి రండి. అమ్మా! ఇతను...'' గీత హడావిడిగా అంటుంటే ఆ ఇద్దరూ నవ్వుతూ లోపలికి వచ్చేశారు.

సుభద్ర తెల్లబోయింది. తెల్లబోయినా గీతని పదునుగా చూస్తోంది.

ఎవరీ శంకర్? నాకు తెలీకుండా దీని కెట్లాగ తెలిశాడు?

వీళ్ళని చందా వాళ్ళనుకున్నానే! కాదా? ఖర్మ. ఈ మధ్య అన్నీ ఇట్లాగే. ఏదో చెయ్యాలనుకుని ఇంకేదో చెయ్యబోవటం.

మంచికి పోతే చెడు ఎదురవటం.

మంచీ చెడూ ఏమిటి నా తలకాయ!

గబగబా లోపలికి వెళ్ళింది. అక్కడ ఆగకుండా వంటింట్లోకి వెళ్లింది.

వెనకాల నవ్వులు వినిపిస్తున్నాయి. 'హు! నన్ను చూసే' అనుకుంది.

కళాయిలోకి చూసింది. ఫరవాలేదు. ఉప్మా సరిపోతుంది.

''వాళ్ళని మర్యాద చెయ్యాలి కదా'' అనుకుంది.

''ఐనా వాళ్లు దీని కోసం ఇంటికి రావటమేమిటి? అబ్బాయిలతో స్నేహం చేస్తోంది కాబోలు. భయం లేకుండా ఇంటికే వచ్చారు. ఇదే రమ్మంది కాబోలు. లేకపోతే వాళ్ళే వచ్చారా! దీని కెట్లాగైనా నచ్చ చెప్పాలి...స్నేహాలు... మగపిల్లలతో... మంచిది గాదని'' అనుకుంది.

గీత లోపలికి వచ్చింది.

''అమ్మా, వాళ్ళకి కాఫీ!''

''ఇదుగో, ఉప్మా ఉంది పెట్టు.''

గీత సంతోషించింది. చెల్లెలు లత సాయంతో కాఫీ ఫలహారాలు ఇచ్చింది.

సుభద్రకి ఉప్మా చల్లారితే సయించదు. కొంచెం ఉప్మా ప్లేటులో వేసుకుని తిని గీత ఏం చేస్తోందో చూద్దామని హాల్లోకి వచ్చింది.

సుబ్బారావుగారు, గీత.... ఎవరూ లేరు అక్కడ.

ఎక్కడ మాయమయ్యారో అని విసుక్కుంది. సుధ అక్కడే సోఫాలో కూర్చుని కొత్తగా కొన్న చీర మీద అద్దాలు కుడుతోంది.

''గీతేదీ? మీ నాన్న ఎటు వెళ్ళారు?'' అని అడిగింది.

''నటేశం గారు వస్తే నాన్న వెళ్ళిపోయారు. గీత ఆ అబ్బాయిలతో వెళ్ళింది.'' అంది సుధ, ఓరకంట తల్లి ముఖంలో మార్పుల్ని కనిపెడుతూ.

''ఏమిటీ!'' అంది సుభద్ర. తను సమంగా విన్నదా లేదా అని అనుమాన పడుతూ.

''రేఖా గారింటికి వెళ్లాలి అన్నారు వాళ్ళు. నాకు తెలుసు వాళ్ళిల్లు అని గీత వాళ్ళని తీసుకెళ్లింది.'' అని చెప్పి సుధ నవ్వుతోంది.

అందరూ తనని చూసి నవ్వుతున్నట్లుగానే ఉంది సుభద్రకి.

''నేను ఎక్కడికి వెడతానన్నా ఒక పట్టాన వెళ్ళనిచ్చేదానివి కాదు. ఫ్రెండు ఇంటికి వెడతానంటే ఆ అమ్మాయికి అన్నయ్యలున్నారా? ఇంట్లో ఇంకా ఎవరెవ రున్నారూ? అంటూ లక్ష ప్రశ్నలు వేసేదానివి. ఇప్పుడు గీత చూడు. ఏమీ చెప్పదు. ఆలస్యంగా వచ్చి సినిమా కెళ్ళాను అంటుంది. కాలేజీలో చేరి ఏడాది అయిందో లేదో ఆబ్బాయిలు దానికోసం ఇంటికి వస్తున్నారు.'' అంది సుధ.

ఔను. సుధ చెప్పేదంతా నిజమే. గీతని అదుపులో పెట్టాలి. సుధ ముందరే

అడిగేది. వర్ధనటానికీ గీత అవకాశం ఇస్తే కదా.

''ఏమో తల్లీ వర్ధన్నా కోప్పడినా మీ మంచిని కోరే. చుట్టూ ఎన్నో ఆకర్షణలు ఎక్కడ తొందరపడతారో, తప్పటడుగు వేస్తారో అని నా భయం నాది...'' అంది సుభద్ర.

''తప్పేమిటమ్మా! కష్టం, నష్టం రాకుండా చూసుకోగలిగితే అంతా ఒప్పే. అందరూ సుఖంగా బ్రతకాలనే కదూ తప్పులూ పట్టింపులూనూ'' అంది సుధ ఆరిందా లాగ.

పెళ్ళయి మొదటిసారి... సుఖంగా బిడ్డను కనకుండా ఎబార్షన్‌కి తయారవుతోంది. అల్లుడు దానికి మద్దతు. ఇంక వాళ్ళకి తప్పేమిటి? మంచేమిటి? సుధకి జవాబివ్వకుండానే లోపలికి వెళ్ళింది సుభద్ర. వంట ప్రారంభించిం దన్నమాటే కానీ మనసంతా వీధి గేటు మీద ఉంది.

చప్పుడైతే గీత వస్తుందని.....ఊరుకోకూడదని.

* * * *

''వాళ్ళతో అట్లాగ వెళ్లిపోవటమేవా? మంచీ చెడ్డా లేదూ'' అంది సుభద్ర.

వెళ్ళిన అరగంటకే వచ్చింది గీత. గీత రాగానే అడిగేసింది సుభద్ర.

గీత ఆశ్చర్యంగా చూసింది.

నేనెక్కడి కెళ్ళానని!'' అంది గీత.

''మొగపిల్లల వెంట వీధులలో తిరగటం...''

''బాగుంది. వాళ్ళు రేఖా వాళ్ళిల్లు తెలీదన్నారు. దగ్గరే కదా అని నాకు తెలుసునని తీసికెళ్ళాను. షికార్లకి వెళ్ళానా? ఊళ్ళకి వెళ్ళానా? ఆ మాత్రం సాయానికి పనికిరాకపోతే మనిషి జన్మ ఎత్తటం దండగ.''

''అట్లాగని ఆడపిల్ల...''

''ఆడపిల్ల మనిషి కాదా?''

''ఇష్టం వచ్చినట్లు నా దగ్గర వాగటం కాదు గీతా. ఇప్పుడు సరదాగానే ఉంటుంది. తరవాత ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావు. వెనకాల తిరిగినవాడే పెళ్ళి మాట కొస్తే తప్పుకుంటాడు.'' అంది సుభద్ర గంభీరంగా.

''ఛీ, ఛీ! వాళ్ళకి ఇల్లు చూపించానని పెళ్ళి చేసుకోవాలా? ఇంత అనాగరికత ఎక్కడా చూళ్ళేదు. ఎవడితో నేనా నాలుగడుగులు నడిస్తే వాణ్ణే పెళ్ళి చేసుకోవాలా? ఇంత వెనక బడిన జాతా మనది? ఇంత అన్‌సివిలైజ్డా మనం? వాళ్ళెవరూ నన్ను పెళ్ళి చేసుకోవక్కర లేదు. పెళ్ళి కాకపోతే పోనీ...'' అంది గీత కోపంతో తీవ్రంగా.

''నీకేం బాధలేదు. అన్నింటికీ తెగించావు. నాతో చెప్పకుండా గుమ్మం కదలకు.

ఇన్నాళ్ళూ నీ గురించి ఏమి పట్టించుకోనందుకు బాగానే తయారయ్యావు. చదువు కుంటున్నపిల్లలు... వాళ్ళకే తెలుస్తుందిలే మంచీ..చెడూ అనుకుంటే... మీ నాన్న ఏదీ పట్టించుకోరు. కానీ రేపేదైనా వస్తే నన్నే అంటారు.'' అంటూ సుభద్ర అక్కడనుంచి వెళ్ళిపోయింది.

గీత కళ్ళలోకి నీళ్ళు వచ్చాయి.

''రేపేదైనా వస్తే.. ఇంత అవమానించింది చూడు, అమ్మ నన్ను'' అంది సుధతో.

''ఊరుకో గీతా. జనరేషన్ గాప్. అంతే. వాళ్ళకి అన్నింటికీ భయమే. ప్రతీదీ తప్పే. చిన్న పరిధి గీసుకుని అందులోనే ఇమిడిపోయి బతుకుతారు. అసలు వాళ్ళకి లైఫ్ అంటే ఏమిటో తెలీదు. ఇంతకీ శంకర్ ఎందుకు వచ్చాడు?'' అనడిగింది సుధ.

''కల్చరల్ వీక్ చేస్తున్నారు. వాలంటీర్లు కావాలిట. రేఖా లేడీస్ రిప్రజెంటెటివ్ కదూ. అడుగుదామని. నేను ఊరుకోను సుధా, ఇన్సల్టుకి తల వంచటమే బానిసత్వానికి మొదటి మెట్టు'' అంది.

''గీత ఏం చేస్తుంది!'' అనుకుంది సుధ.

* * * *

భోజనాలకి అందరూ వచ్చారు. గీత రాలేదు.

''ఎక్కడికి వెళ్ళింది! అలిగి పడుకుందేమో!'' అంది సుభద్ర.

''ఇంట్లో ఎక్కడా లేదు'' అంది లత.

''నేనంతో నచ్చు చెప్పాను. దానికి కోపం వచ్చింది'' అంది సుధ.

సుభద్ర గుండె దడ దడ లాడింది.

భర్తతో బతుకు కత్తిమీద సాము అనుకుంటుంటే, ఈ ఆడపిల్లలతో అడకత్తెర లాగుంది. ఈ మాత్రానికే... ఎక్కడికి పోయింది! ఆ మాత్రం అదుపులో పెట్టుకోదూ ఏ తల్లైనా పిల్లల్ని! కోప్పడినంత మాత్రాన ఇల్లు వదిలి పెట్టేస్తుందా? భయం ఉండక్కర్లా? నాకు తెలీకుండా ఇంత కాలం ఏం జరగలేదు కదా? ఎవరైనా స్నేహితురాలింటికి వెళ్ళిందా? ఆ పిల్లాడి దగ్గిరకి గానీ వెళ్ళిందా?

సుధ తెలిసిన స్నేహితురాళ్ళందరికీ ఫోన్ చేసింది. ఎక్కడా లేదుట. ఎవరికీ తెలీదుట. సుభద్రకి కాళ్ళూ చేతులూ ఆడటంలేదు.

''ఇంక ఆయనకి చెప్పక తప్పదు'' అనుకుంది.

''ఏమిటలా మొహాలు చూసుకుంటున్నారు?'' అనడిగారు అప్పుడే ఇంటికి వచ్చి భోజనానికి కూర్చున్న సుబ్బారావు గారు.

''అమ్మ పొద్దున్న గీతని తిట్టింది. గీతకి కోపం వచ్చి ఎక్కడికో వెళ్ళిపోయింది'' అంది లత తల్లి ముఖంలోకి చూస్తూ.

''ఏమన్నావు దాన్ని? అసలేం చేసింది గీత?'' సుబ్బారావు గారు సుభద్రని ప్రశ్నించారు. ఆవిడకి గొంతు పూడుకుపోయింది బాధతో.

ఏమీ పట్టించుకోరు. బాధ్యత లేదు ఆయనకి. బాధ్యతంతా వహించాలి తను. కానీ ఎవరినీ ఒక్క మాట కుడా అనకూడదు. అసలు ఇదంతా ఆయన పిల్లలకి ఇచ్చిన అలుసు కదూ.

సుభద్ర జవాబు చెప్పకుండా వడ్డిస్తోంది.

''పొద్దున్న వాళ్ళ కాలేజీ అబ్బాయిలు వచ్చారు నాన్నా! ఎవరిదో ఇల్లు తెలీదంటే చూపించటానికి వాళ్ళతో వెళ్ళింది. ఎందుకు వెళ్ళిందో తెలీక అమ్మ దాన్ని కోప్పడింది. గీతకి కోపం వచ్చింది.'' అంది సుధ ఎవరి తప్పు లేదన్నట్లు.

''అంత మాత్రానికే! దాన్నెందుకు కోప్పడ్డావు! ఎక్కడికి పోతుందిలే. అదే వస్తుంది. భోజనం కానీ'' అన్నారాయన.

''ఎక్కడికి పోతుంది! అంత అహంకారమా! తల్లిని, ఒక్క మాట అన కూడదూ దాన్ని. ఏం చేస్తుందో చెయ్యనీ నేనూ చూస్తాను. కోప్పడనా? నా పిల్లలు నా మాట వినాల్సిందే'' అనుకుని బింకంగా అన్నానికి కూచుంది సుభద్ర. కానీ ముద్ద గొంతు దిగటంలేదు. సుబ్బారావుగారు చెయ్యి కడుక్కుని వెళ్ళగానే, తనూ లేచి చెయ్యి కడిగేసుకుంది.

వెళ్ళి పడుకుంటే ఆలోచనలు తప్ప నిద్ర రావటంలేదు. రోజూ భోజనం చెయ్యగానే నిద్ర ముంచుకు వచ్చేది. ఆలోచిస్తూ ఏం తోచిందో చటుక్కున లేచి చెప్పులు తొడుక్కుని ఎవరికీ చెప్పకుండానే బయలు దేరింది.

రేఖా ఇంటికి వెళ్ళింది. రేఖతో కొంచెం పరిచయం ఉంది.

''కూర్చోండి ఆంటీ'' అని మర్యాద చేసింది.

సుధ అంతకు ముందే ఫోన్ చేసింది రేఖకి కూడా.

''గీత ఇంటికి వచ్చిందా ఆంటీ.''

''లేదింకా. ఎక్కడికి వెళ్ళి ఉంటుందో నాకు తోచటంలేదు. పొద్దున్న శంకర్ ఇంకో అబ్బాయి వచ్చారు మా ఇంటికి.''

''ఔను. శంకర్ మా యూనియన్ ప్రెసిడెంట్.''

''గీత క్లాసా?''

''కాదు ఫైనలియర్. చాలా తెలివైన వాడు. బాగా చదువుతున్నాడు, ఎన్ని

ఫ్లక్టివిటీస్ ఉన్నా కూడా. డాక్టర్ చంద్రమోహన్ గారి అబ్బాయి.''

''డాక్టర్ చంద్రమోహనా ఆ పేరు ఎక్కడో విన్నట్టుంది.''

''ఔను. సికిందరాబాద్‌లో ఉంటారు. దోమల్‌గూడాలో... స్వంత ఇల్లుంది.''

గుర్తు వచ్చింది. పక్కింటి వాళ్ళ ఫామిలీ డాక్టర్. వాళ్ళింట్లో ఒక సారి చూసింది.

''చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళదు. భోజనాల వేళ దాటిపోయింది కూడానూ''

తన ఆదుర్దాపైకి కనపడనీయకుండా అంది.

''చెప్పటం మరిచిపోయి ఉంటుంది. ఏ ఫ్రెండింటికో వెళ్ళుంటుంది. మీరు దిగులు పడటం అనవసరం.'' అంది రేఖ.

''వస్తాను'' అని చెప్పి ఇంటికి బయలుదేరింది సుభద్ర.

అనవసరంట దిగులు పడటం! పిల్ల చెప్పకుండా వెడితేనూ, వేళకు రాలేకపోతేను బాధపడటం అనవసరమా? ఈ కాలంవాళ్ళకి అన్నీ అనవసరమే. పిల్లల్ని కనటం అనవసరం, కష్టపడి పెంచటం అనవసరం, వాళ్ళకోసం బాధపడటం ఇంకా అనవసరం.

సుభద్ర ఇంటికి వెళ్ళేటప్పటికి సుబ్బారావుగారు డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు. సుబ్బారావు గారు ఏ సంగతి పట్టించుకోరు. కానీ, పట్టించుకుంటే ఏ వ్యవహారమైనా అక్కడికక్కడ తేలిపోవాలి.

''ఏమిటి ఈ గొడవ ఇంట్లో! అది అలిగి ఎక్కడికో పోయింది. నీ తీర్న నువ్వు చెప్పా పెట్టకుండా ఎక్కడికో పోయావ్! మతులు పోయాయి అందరికీ. పోలీసు రిపోర్టివ్వమంటావా?'' అంటూ ఎగిరారు.

సుభద్ర గుండె దడదడలాడింది. ఈయన కంతా ఒకటే తొందర! గీత ఎక్కడి కెళ్ళిందో అని గాబరాగా ఉన్న మాట నిజమే కానీ, ఏదో అఘాయిత్యం చేసినట్టు పోలీసు రిపోర్టిచ్చుకుంటారా? ఈయనతో ఏమంటే ఎటు పోతుందో తెలీదు.

''ఏం మాట్లాడవేం?'' మళ్లీ ప్రశ్నించారాయన.

''స్నేహితు లెవరిళ్ళలోనూ లేదు.''

''ఐతే ఎక్కడి కెళ్ళిందంటావ్?''

తనకేం తెలుసు! ఏమనటానికీ.... ఒక్కటే అనుమానం మిగిలింది...

''పొద్దున్న శంకర్ అని కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్ వచ్చాడు.''

వాడింటికి వెళ్ళిందంటావా? ఎందుకెళ్ళింది? వెళ్ళి అడిగొస్తా నుండు...'' ఆయన గబగబా కుర్చీలోంచి లేచారు. ఇంక ఆయనని ఆపటం సాధ్యం కాదు.

''వాళ్ళిళ్ళు దోమల్‌గూడా...ఆ పిల్లాడి తండ్రి డాక్టర్ చంద్రమోహన్.'' అంది.

''ఔను అన్నట్టు ఎడ్రస్ ఉంది కదూ. డాక్టర్ చంద్రమోహన్ నాకు

తెలుసులే'' అంటూ షర్ట్ వేసుకుని మెట్లు దిగుతున్నారు.

వెళ్ళి ఏమని అడుగుతారూ... నేనూ వస్తున్నానుండండి'' అంటూ స్కూటర్ వెనకాల సీటు మీద కూర్చుంది సుభద్ర.

ట్రాఫిక్ తక్కువగా ఉన్న రోడ్డు మీద పోతోంది స్కూటర్.

''ఏమని అడుగుతాం? ఎందుకు వచ్చినట్లు చెప్పటం? మా అమ్మాయి మీ ఇంటికి వచ్చిందా అని అడిగితే ఏం బాగుంటుంది?'' అంది సుభద్ర మెల్లిగా.

''మరి ఏమని అడగమంటావ్? మీ అబ్బాయి మా అమ్మాయిని ఎందుకు ప్రేమించాడని అడగమంటావా? వాళ్ళింటికి వెళ్ళిందని కదా నీ ఉద్దేశం. వెళ్ళి చూద్దాం తెలిసిపోతుంది.''

''నా తలకాయ. నా అనుమానం అక్కడి కెళ్ళిందేమోనని... ఎక్కడా లేకపోతే ఏమైపోతుందని! వాళ్ళింటికి వెళ్ళలే దనుకోండి. ఎంత అసహ్యంగా ఉంటుంది.''

''ఐతే ఏం చేద్దామంటావ్. ఇంటికి వెళ్ళిపోదామా? అది వచ్చేదాకా, దానంతట అది, సణిగి నా ప్రాణం తియ్యకుండా కూర్చుంటానంటే పోదాం పద ఇంటికి.''

''సరే. కానివ్వండి. డాక్టర్ చంద్రమోహన్ గారింటికే పదండి. ఏదవ్వాలో అది అవుతుంది.'' అంది సుభద్ర విరక్తిగా.

చక్కటి తోట ఉన్న ఇల్లు. పేరు రాసి ఉంది. గేటు తీసుకుని లోపలికి వెళ్ళారు. తలుపులన్నీ తీసే ఉన్నాయ్. పనివాడు కాబోలు.

''లోపలికి వచ్చి కూర్చోండి. అమ్మ గారితో చెప్తాను'' అని లోపలికి వెళ్ళాడు. సందేహిస్తూ సోఫాల్లో కూర్చున్నారు. రెండు నిముషాల్లో ఒకావిడ అక్కడికి వచ్చింది. సుబ్బారావుగార్ని చూసి.

''డాక్టర్ గారి కోసమూండీ. ఆయన ఇంట్లో లేరు.'' అంది.

సుభద్ర ఆవిడనే చూస్తోంది. ఆవిడ కూడా సుభద్రను చూసింది. వెంటనే ''సుభద్ర'' అంది.

''విమలా!'' అంది సుభద్ర.

ఎన్నాళ్ళకి కలుసుకున్నామంటే ఎన్నాళ్ళకి కలుసుకున్నాం అనుకున్నారు సంతోషంగా. పావుగంట తరవాత గానీ తనెందుకు వచ్చిందీ గుర్తు రాలేదు సుభద్రకి.

''ఇప్పుడు మేము ఇక్కడున్నట్లు నీకెలా తెలిసిందీ'' అంది విమల అప్పుడు.

చెప్పటానికి ఒక క్షణం సంకోచ పడినా... ఇన్నాళ్ళ మధ్య దూరమూ మాయ మయిపోయి ఆనాటి విమలతో మాట్లాడుతున్నట్టే ఉంది సుభద్రకి.

''నాకు ముగ్గురూ కూతుళ్ళే అని చెప్పాను కదూ. మా రెండోది గీత కాస్త గడుగ్గాయి.'' అంది చిరునవ్వుతో.

''ఈ కాలం పిల్లలంతా అట్లాగే ఉన్నారులే.'' అంది విమల.

''ఈ వేళ పొద్దున్న దాని ఫ్రెండ్సుమి అంటూ ఇద్దరు అబ్బాయిలు వచ్చారు. వాళ్ళతో ఇది కూడా కలిసి ఏదో పని ఉందంటూ ఇంకో అమ్మాయి యింటికి వెళ్ళారు. చెప్పొద్దూ. ఇట్లాగ ఆడపిల్లలు, అబ్బాయిలతో కలిసి తిరగడం నాకిష్టం ఉండదు విమలా. పొద్దున్న మా ఇంటికి వచ్చిన అబ్బాయిల్లో ఒకతను శంకర్.''

''ఎవరు, మా శంకరా!''

''ఊఁ. మీ అబ్బాయని నాకు తెలీదు. డాక్టర్ చంద్రమోహన్‌గారి అబ్బాయని తెలిసింది. ఒకవేళ గీత ఎక్కడకెళ్ళిందో అతడికి తెలుసేమో అడుగుదామని వచ్చాం.''

''వాడు ఎక్కడికో వెళ్ళాడు. ఏదో ప్రోగ్రామ్ ఉందని బిజీగా తిరుగుతున్నాడు. వాడికోసం అమ్మాయిలు వస్తుంటారు. కానీ వాళ్ళలో గీత అనే అమ్మాయి ఎవరూ లేరు నాకు తెలిసినంతవరకూ. మా ఇంటి కెప్పుడూ రాలేదు. ముందర నాకూ భయంగానే ఉండేది కానీ వాళ్ళు ఇంటికి వచ్చి ''ఆంటీ'' అంటూ కబుర్లు చెపుతుంటే వాళ్ళని అపార్థం చేసుకున్నందుకు నన్ను నేనే తిట్టుకున్నాను. ఐనా ఈ కాలం పిల్లలు మనలా కాదు. ఫ్రీగా మాట్లాడుకుంటారు. మనం చదువుకునే రోజుల్లో ఏ అమ్మాయైనా ధైర్యం చేసి ఒక అబ్బాయితో మాట్లాడితే ఎన్ని పుకార్లు పుట్టేవి! ఇంక వాళ్ళు ప్రేమించు కున్నట్టే లెక్క కట్టేసేవారు! ఎంత సేపూ అది మగ జాతి, మనది ఆడ జాతి అన్న భేద భావమే తప్ప అందరం మానవులం, స్నేహంగా ఉండాలి అన్న ఆలోచనే ఎరగం'' అంది.

''ఐతే ఇప్పుడు వీళ్ళకి ఆ ప్రేమలూ, ఆకర్షణలూ ఉండవంటావా?'' అంది. సుభద్ర.

''ఉంటాయి. కానీ కలిసి మెలిసి తిరుగుతుంటే చాలా భ్రమలు తొలిగిపోయాయి. ఇంట్లో వాళ్ళతో తప్ప ఏ మగవాడితోనూ మాట్లాడని అమ్మాయి ఎవరితో అయినా ప్రథమ పరిచయంలోనే ప్రేమించాను అనుకుంటుంది. అట్లా కాక అబ్బాయి లందరినీ చూస్తుంటే తనకి ఎటువంటివా డంటే ఇష్టమో తెలుసుకోగలుగుతుంది. నిజంగా ప్రేమించగలుగుతుంది .'' అంది విమల.

''ఇప్పుడు గీతని గురించి నాకు బెంగ తీరిపోయింది. ఆ అబ్బాయి మీ అబ్బాయి కనుక స్నేహం చేసినా ఫరవాలేదు.'' అంది సుభద్ర నవ్వుతూ. పనివాడు టీ తెచ్చాడు. ట్రే తో విమల లేచి అందిస్తుంటే శంకర్ లోపలికి వచ్చాడు. సుభద్రకీ, సుబ్బారావుగారికీ నమస్తే చెప్పి టీ తీసుకున్నాడు.

''పొద్దున్న వాళ్ళింటికి వెళ్ళావుట కదా'' అంది విమల.

ఔను పనివుండి''

''సుభద్ర అంటే గీతా వాళ్ళమ్మ, నేనూ స్నేహితురాళ్ళం.. కాలేజీలో కూడా కలిసి చదువుకున్నాం, గీత కోసం వచ్చారు, ఎక్కడికి వెడుతున్నదీ చెప్పలేదుట''

''నేను లేడీస్ హాస్టల్‌నుంచి వస్తున్నాను, గీత అక్కడ ఉంది.'' అన్నాడు శంకర్. బరువు తీరిపోయినట్లు ఒక నిట్టూర్పు వదిలింది సుభద్ర.

''సమయానికి చల్లటి కబురు అందించావు. థాంక్స్'' అంది సుభద్ర శంకర్‌తో.

ఇంక వెడదామంటూ లేచారు సుబ్బారావుగారు.

ఒకరికొకరు ''వస్తూఉండు''మని చెప్పుకున్నారు విమల సుభద్ర.

* * * *

సమంగా మూడేళ్ళు గడిచాయి.

సుధ కొడుకుని తీసుకొని భర్త వెంట స్టేట్స్‌కి వెడుతోంది ఆ రోజు.

సామాను సర్దుకుంటుంటే అడ్డు వచ్చి అల్లరి చేస్తున్నాడు బాబు. వాడిని బ్రతిమాలుకుంటోంది సుధ.

''పోనీ వీణ్ణి నా దగ్గర ఉంచరాదూ. అల్లరి చేస్తాడు హాయిగా తిరిగి రావచ్చు'' అంది సుభద్ర.

''అమ్మో వాణ్ణి వదిలి నేనుండగలనా!'' అంది సుధ.

సుభద్ర నవ్వుకుంది.

సుధ గురించి ఇంక దిగులు లేదు.

ఇప్పుడు గీత గురించే ఆలోచన. బి.ఎ. పాసైంది. ఇంక చదవను అంది ముందర. మళ్ళీ ఏమొచ్చిందో, మనసు మార్చుకుని ఎమ్మేలో చేరింది.

దానికి పెళ్ళి చెయ్యాలి. ఆయనకి ఆ ధ్యాసే లేదు. చదువుకుంటోంది కదూ అంటారు. ఆయనకి చెప్పటం ఎట్లాగో అర్థం కాదు.

శంకర్ రిసెర్చి స్కాలర్‌గా చేరాడు. కుర్రాడు బాగుంటాడు. మంచివాడు కూడానూ.

గీతని శంకర్‌కి ఇస్తే బాగుంటుంది. కానీ వాళ్ళది పై అంతస్థు.

అంతరాలు స్నేహాన్ని బాధించవు కానీ, పెళ్ళంటే అన్నీ ఆలోచించుకోవాలి.

వాళ్ళు అడిగిన కట్నం ఇయ్యగలిగి ఉండాలి కదా! అటువంటి సంబంధానికి ఈ రోజుల్లో తేలిగ్గా ఇరవై వేలు ఇస్తున్నారు, ఇచ్చేవాళ్ళున్నారు.

విమలని అడిగి లేదనిపించుకోవటం ఎందుకు?

''గీతకి సంబంధాలు చూడండీ'' అని ఆయనతో అంటే.

''ఏమిటి చూడాలి! నేనెవరనీ చూడలేదు. నన్నెవరూ చూడలేదం''టారు.

సుభద్రకి ఏడవలేక నవ్వు వస్తుంది. తమది మేనరికం.

''సరే, దాని రాత ఎలాగుందో?'' అనుకుంటుంటే గీత వచ్చి,

''అమ్మా, విమల ఆంటీ వచ్చారు'' అంది

సుభద్ర లేచి వెళ్ళింది, అంతా డ్రాయింగు రూమ్‌లో కూర్చున్నారు.

''ఏం సుధా, స్టేట్స్‌కి వెడుతున్నారుట. చివరికి మీ అమ్మే గెలిచింది'' అంది విమల.

''ఎందుకు ఆంటీ'' అంది సుధ.

''నువ్వు ఫారిన్ వెడతానన్నావ్. మీ అమ్మ బాబు కావాలి అంది. అట్లాగే బాబు వచ్చాడు'' అంది విమల.

''నేనూ గెలిచినట్లే. ఇప్పుడు ఫారిన్ వెడుతున్నాం కదూ'' అంది సుధ.

''అది కాకతాళీయం. చివరికి మేమే గెలుస్తాం. ఎప్పుడో మీరు మా దోవలోకి రాక తప్పదు'' అంది నవ్వుతూ...

''మీరుకూడా మా దోవలోకి రావచ్చు కదూ ఆంటీ'' అంది సుధ అంతటితో ఊరుకోక.

''రావచ్చు... గమ్యం ఒకటే ఐతే'' అని సుభద్ర వైపు తిరిగింది.

''నీతో ఒక సంగతి చెప్దామని వచ్చాను'' అంది.

అందరూ ఆవిడవైపే చూస్తూంటే సుభద్రలో కుతూహలం రేగింది.

''మా శంకర్‌కి సంబందాలు వస్తున్నాయి. వాడికి పెళ్ళి చేద్దామనుకుంటున్నాం. మీ గీతని మా శంకర్‌కి ఇవ్వమని అడుగుదామని వచ్చాను'' అంది విమల.

ఆశ్చర్యం, సంతోషంతో బాటు ఏవేవో అనుమానాలు.. వెంటనే నోట మాట రాలేదు సుభద్రకి. ఒక నిముషం నిశ్శబ్దం. తరవాత...

''నిజంగానా! నా కంతకంటే సంతోష మేముంటుంది! వాళ్ళిద్దరికీ ఇష్టమైతే .. శంకర్ని అడిగావా? గీత ఏమంటుందో'' అంది.

''ఆ... వాళ్ళిద్దరికీ యిష్టమే. శంకర్ నాకు చెప్పాడు. నువ్వింకా వాళ్ళ సంగతి కనిపెట్టలేదూ! శంకర్‌కి వొకసారి మెడికల్ రిప్రెజెంటేటివ్ జాబ్ వచ్చింది. రిసెర్చి స్కాలర్‌షిప్పూ వచ్చింది. ఎందులో చేరాలో సందేహంలో పడ్డాడు. గీత రిసెర్చి స్కాలర్‌గా చేరమందిట. అందులోనే చేరాడు. గీతని యమ్మే చెయ్యమని శంకరే అన్నాడుట. గీత ఇంక చదవనని అనలేదూ ముందర. వాళ్ళప్పుడే కూడబలుక్కోవటం

మొదలుపెట్టారు. ఇంక మనదే ఆలస్యం. ఒక వేళ గీతకీ మాకూ కుల భేదం ఉన్నా గీతనే నా కోడలిగా చేసుకునే దాన్ని. ఎందుకంటే నువ్వు నా స్నేహితురాలివి. గీత నాకు నచ్చింది. ముఖ్యంగా శంకర్‌కి నచ్చింది'' అంది విమల.

విమల ఎంత మంచిది! ఇంకా కట్నం కావాలో, ఏమిటో అని సందేహిస్తున్నాను.

శంకర్ తల్లికి చెప్పాడు. గీత నాకు చెప్పనే లేదు. ఔను, చెప్తే మాత్రం నేను విమలని అడిగేదాన్నా? నిజానికి సందేహించ నవసరం లేదు. కానీ కట్నం కావాలంటే...

సుభద్ర ఆలోచనలన్నీ చదువుతున్నట్టు వెంటనే విమల అంది.

''ఇంక మనం చెయ్యాల్సిన దంతా ముహూర్తం పెట్టించి మూడు ముళ్ళూ వేయించటమే. వాళ్ళిద్దరూ ఇష్టపడి చేసుకుంటున్న పెళ్ళి. కట్నాల ప్రసక్తి లేదు. ఎవరికి తోచిన బహుమతులు వాళ్ళిచ్చుకుంటారు.''

''ఉండండి మరి. శుభవార్త విన్నందుకు స్వీట్ తినాలి'' అంటూ సుభద్ర వంటింట్లోకి నడిచింది.

గీత తల్లి వెనకే వెళ్ళింది.

''అమ్మా ఏం చేస్తావ్?''

''హల్వా!''

''ఏలకులున్నాయా? పొడి కొడతాను..'' .

గీతకు ఏలకులు అందిస్తూ....

''శంకర్ ఎప్పుడడిగాడు నిన్నూ?'' అంది సుభద్ర.

''మనమంతా పిక్నిక్కి వెళ్ళలేదూ'' అంది గీత.

నెల అయింది. గండిపేట వెళ్లారు. గీత చెప్పలేదని బాధగానూ వుంది. ఐనా ''అప్పుడు నేను అంటే ఛీ ఛీ అన్నావ్'' అంది సుభద్ర నవ్వుతూ.

''ఎప్పుడూ? అప్పుడా! అప్పుడునాకేం తెలీదు!'' అంది గీత సిగ్గుపడుతూ.

ఔను, తెలుసుకోటానికి మూడేళ్ళు పట్టింది. విమల అన్నది నిజమే. తన భయంలోనూ నిజం లేకపోలేదు... ఏదీ అడ్డు కాలేదు కాబట్టి ఇట్లా సంతోషంగా ఉంది. ప్రేమలూ, మమకారాలూ, ఆకర్షణలూ లేకుండా ఎక్కడికి పోతయ్? అవి కాపురముండేది మనుషుల మనసుల్లోనే అనుకుంది సుభద్ర.

*   *   *   *